భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 15.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



గొరగనమూడి గ్రామంలో జగనన్న కాలనీ కోసం సేకరించిన పంట పొలం

ఆంధ్రజ్యోతి పరిశీలన

జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది.. పట్టా ఇస్తాం రండి.. అంటూ కొంతమంది లబ్ధిదారులను ఆ స్థలంలోకి తీసుకెళ్లి ఫోటోలు తీయించారు.. చేతికి ఇంటి పట్టా కూడా ఇచ్చారు. కానీ నాలుగేళ్లు పూర్తయినా ఇంతవరకు స్థలం ఇవ్వలేదు. తమ స్థలం ఎక్కడ ఉందో కూడా తెలియదంటూ కొంతమంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. కొన్ని చోట్ల ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.30 నుంచి రూ.50 వేల వరకు స్థానిక నేతలు వసూలు చేశారు. పేద ప్రజల కోసం చేపట్టిన జగనన్న గృహ నిర్మాణ పథకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. మంత్రులు, నాయకులు మాత్రం స్థలాలిచ్చాం..ఇళ్లు కట్టామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. పట్టాలందుకున్న లబ్ధిదారులకు తమ ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి...వారంతా ఇప్పుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.



పూడికకు నోచుకోకుండా ఖాళీగా ఉన్న దిరుసుమర్రు రోడ్డులో జగనన్న లే- అవుట్

జగనన్న ఇళ్ల గోడు

పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామంటూ ప్రభుత్వం దబాయిస్తోంది. ఎన్నికల ముందు ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్‌లు నిర్వహిస్తూ హడావుడి చేస్తోంది. క్షేత్ర స్థాయిలో మాత్రం లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. ప్రధానమంత్రి ఆవాస యోజనలో జిల్లాలో 72 వేల ఇళ్లు మంజూరు చేశారు. అందుకు సంబంధించి పట్టణాల్లో పేదలకు సెంటు స్థలం, గ్రామాల్లో సెంటున్నర స్థలాన్ని కేటాయించారు. ఇప్పటికీ కొన్ని చోట్ల స్థలాలను చూపించలేదు. పూడిక చేయలేదు. ఫలితంగా పేదలు ఇళ్లు నిర్మించుకోలేని దుస్థితి నెలకొంది. భీమవరం, కాళ్ల, పాలకోడేరు, తణుకు వంటి ప్రాంతాల్లో ఇటువంటి సమస్య ఉంది. మరోవైపు పూడిక చేసిన స్థలాల్లోనూ ఇళ్ల నిర్మాణం సజావుగా సాగడం లేదు. జిల్లాలో దాదాపు 11 వేల మంది లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ముందుకొచ్చింది. తీరా చూస్తే పనులు మధ్యలోనే నిలచిపోయాయి. కాంట్రాక్టర్‌లు చేతులెత్తేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 1.80 లక్షలతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. అదనంగా పేదలకు ఇచ్చేదేమీ లేకుండా పోయింది. కొద్దిపాటి నిధులతో సొంత ఇళ్లు నిర్మించుకోవడం పేదలకు కష్టంగా మారింది. కాంట్రాక్టర్లు సైతం ముఖం చాటేశారు. మొత్తంపైన జిల్లాలో సగం ఇళ్లు కూడా నిర్మాణం పూర్తి చేసుకోలేదు.

భీమవరంలో పట్టణ శివారులో..

భీమవరం, ఫిబ్రవరి 13 : భీమవరంలో పేదల గృహ నిర్మాణం కోసం పట్టణ శివారున 73.12 ఎకరాల సేకరించారు. జీఅండ్‌వీ కెనాల్ గట్టు నుంచి లేఅవుట్ వరకు కొంత మట్టి వేసి పుంత రోడ్డు ఏర్పాటు చేశారు. తర్వాత చేతులు దులిపేసుకున్నారు. ఈ 73.12 ఎకరాలలో పట్టణంతో పాటు కొత్తగా పట్టణంలో విలీనం చేస్తూ ప్రతిపాదించిన తాడేరు, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, మండంలోని నరసింహ పురంలలో 3,833 మందికి ప్లాట్‌లు కేటాయించారు. వీరందరికీ పట్టాలు ఇచ్చారు. ఇంతవరకు స్థలం చూపలేదు. నాలుగో సంవత్సరంలోకి అడుగు పెట్టినా స్థలం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితిలో లబ్ధిదారులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు చెప్పినా అతీగతీ లేదు

పెనుగొండ : పెనుగొండ మండలం సిద్ధాంతం శివారు ఘటాల దిబ్బకు చెందిన 103 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఇవ్వలేదు. స్థలాలు ఇవ్వకపోగా కార్యాయాల చుట్టు తిప్పించుకుంటున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే రంగరాజు గడపగడపకు వచ్చిన సందర్భంలో మొరపెట్టుకోగా నెలరోజుల్లో ఇస్తామని చెప్పారని ఇప్పటి వరకు అతీగతీ లేదని అంటున్నారు. స్థానిక వీఆర్‌వోను వివరణ కోరగా 103 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాల్సి ఉందని ఇంకా స్థల సేకరణ జరగాలని తెలిపారు.



సిద్ధాంతం ఘటాల దిబ్బలో ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలం

పట్టా ఇచ్చారు..స్థలం ఎక్కడుందో ?

- లబ్ధిదారులకే తెలియని పరిస్థితి
- గ్రామాలకు దూరంగా కేటాయింపు
- రహదారి, కరెంటు, నీటి వసతుల్లేని ప్రాంతాల్లో స్థలాలు
- సగం మందికిపైగా పొజిషన్ చూపని వైనం
- ఉన్న స్థలాల్లో కట్టలేమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

సగానికి పైగా ఎక్కడుందో తెలియదు

కాళ్ల : కాళ్ల మండలంలో 20 లేఅవుట్లులో సుమారు 2,042 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు.వీటిలో దొడ్డన పూడి, పల్లిపాలెం, కోపల్లె గ్రామాల్లోని లేఅవుట్లు కోర్టు వివాదాల కారణంగా పట్టాలు పంపిణీ కార్యక్రమం నిలుపుదల చేశారు. వేంపాడు, కోపల్లె, బొండాడ పేట, కాళ్ళ, కోలనపల్లి, ఏలూరుపాడు గ్రామాల్లో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కాళ్ళ గ్రామంలో సుమారు 9 ఎకరాల్లో వేసిన లేఔట్లులో వేంపాడు, సీసలి, జువ్వలపాలెం, దొడ్డనపూడి, పల్లిపాలెం, కలవపూడి గ్రామాలకు చెందిన 357 మందికి ఇళ్ళస్థలాలు కేటాయించారు. కోలనపల్లి గ్రామంలో వేసిన సుమారు 9.5 ఎకరాల్లో సీసలి, పెదఅమిరం గ్రామాలకు చెందిన 330 మందికి అదే విధంగా ఎల్ఎన్‌పురం సుమారు 7.21 ఎకరాల్లో బొండాడ, ఎల్ఎన్‌పురం, ఆనందపురం గ్రామాలకు చెందిన 258 లబ్ధిదారులకు, కాళ్ళకూరులో 82 మందికి పట్టాలు అందించారు. ఇందులో 1,027 లబ్ధిదారులకు అంటే సగానికిపైగా స్థలాలు పొజిషన్ చూపలేదు. పట్టాలు అందుకున్నా తమకు స్థలాలు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాళ్లలో చెట్టడవిని తలపిస్తున్న జగనన్న లేఔట్

నా ప్లాట్ ఎక్కడుందో తెలియదు

మా గ్రామానికి సుమారు పది కిలోమీటర్లు దూరంలో ఉన్న కోలనపల్లి గ్రామంలో ప్రభుత్వం స్థలం ఇచ్చింది.. పట్టా కూడా ఇచ్చారు. తీరా అక్కడికెళ్ళి చూస్తే సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లేఅవుట్లో నాకు కేటాయించిన ప్లాట్ ఎక్కడుందో తెలియడం లేదు.

-సత్యవతి, పెద అమిరం

వేంపాడులో ఉంటున్న నాకు కాళ్ళలో ఇచ్చారు..

ఎన్నో ఏళ్ళుగా వేంపాడు గ్రామంలో ఉంటున్నాం. అద్దె ఇంట్లో ఉంటున్న మాకు ఇంటి స్థలం కావాలని ధరఖాస్తు చేసుకుంటే మా ఊరి నుంచి సుమారు 12 కిలోమీటర్లు దూరంలో ఉన్న కాళ్ళ గ్రామంలో ఇచ్చారు. ఇల్లు కట్టుకుందామంటే లేఅవుట్ పూర్తిగా సిద్ధం కాలేదంటున్నారు.

-రామలక్ష్మి, వేంపాడు

స్థలాలిచ్చారు..దారీ తెన్నూ లేదు

పాలకోడేరు : మండలంలోని గొరగనమూడి, పాలకోడేరు గ్రామాల్లో జగనన్న కాలనీ కోసం సేకరించిన డి-ఫారం భూములతో పేదల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గొరగనమూడిలో సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంగా నాలుగు ఎకరాల 92 సెంట్ల భూమి సేకరించారు. 292 మందికి పట్టాలు ఇచ్చారు. నాలుగేళ్లయినా స్థలాలు ఇవ్వలేదు. ఆ స్థలాలకు దారీ తెన్నూ కూడా లేదు. పాలకోడేరులో కోడిగట్టును చేర్చి నాలుగు ఎకరాల 75 సెంట్ల భూమి సేకరించారు. 1884 మందికి పట్టాలిచ్చారు.వారిలో చాలా మందికి స్థలాలు చూపించకపోవడంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ రెండు చోట్ల కూడా కాలనీకి వెళ్లేందుకు దారి లేదు. ఇక్కడ సచివాలయం, ఆర్బీకేలను కూడా నిర్మించారు.



నానా ఇబ్బందులు పడుతున్నాం..

జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు నాలుగు సంవత్సరాల క్రితం పట్టా అందించారు. నేటి వరకు ఇంటి స్థలం చూపించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. అద్దె ఇంట్లో ఉండలేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. సొంతింటి కల నెరవేరుతుందని ఎంతో ఆశ పడ్డాం. ఎప్పుడు నెరవేరుతుందో తెలియడం లేదు.

-కొడవలూరి భార్గవి, గొరగనమూడి



ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళన చేస్తాం

జగనన్న కాలనీలో పట్టాలు ఇచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా స్థలాలు చూపించకపోవడం చాలా బాధాకరం. గ్రామానికి సుమారు నాలుగు కిలో మీటర్లు దూరంలో స్థలం సేకరించారు. సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పేదల గోడు పట్టించుకోవడం లేదు. అధికారులకు మొర పెట్టుకున్నా స్పందన కరువైంది. పేదలకు ఇళ్ల స్థలాలు చూపించకపోతే ఆందోళన చేపడతాం.

- పొన్నమండ బాలకృష్ణ, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, గొరగనమూడి



నాగళ్ళదిబ్బలో జగనన్న కాలనీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సొమ్ము తీసుకుని స్థలాలివ్వలేదు

పెనుమంట్ర, ఫిబ్రవరి 15 : పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామ శివారులో నాగళ్ల దిబ్బలో ఇళ్ల స్థలం ఇప్పిస్తామంటూ వైసీపీ నాయకులు ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.30 వేల రూపాయలు వసూలు చేశారని సీపీఎం నాయకుల ఆరోపించారు. నాగళ్ళదిబ్బలో జగనన్న కాలనీలో గురువారం సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజులు మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ. 30 వేలు వసూలు చేసి జగనన్న ఇళ్ల పట్టాలను అమ్ము కున్నారని ఆరోపించారు. సుమారు 12 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం కుదరదని మీ సొమ్ము తీసుకుపొండని చేతిలో పెట్టారన్నారు. దీనికి సంబంధించి పొల మూరు వీఆర్వోని వివరణ కోరగా తనకేమీ తెలియదని వచ్చి ఒక సంవత్సరం మాత్రమే అయిందని చెప్పారు. 12 మంది బాధితులకు వెంటనే ఇళ్లస్థలాలు ఇవ్వాలని లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని గోపాలన్ హెచ్చరించారు. చెల్లబోయిన సీత, కవురు మల్లేశ్వరి, వరలక్ష్మి, కండిబోయిన మంగాదేవి, ఈశ్వరి, చిన్నారి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు, టీడీపీ నాయకులు

హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఇంజనీర్ల బృందం ముదునూరి స్క్రిప్ట్ చదివింది : మాజీ ఎమ్మెల్యే బండారు

నరసాపురం, ఫిబ్రవరి 15: ఏటిగట్టు మరోసారి కుంగడంతో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. నరసాపురం ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారంటూ మండిపడ్డారు. పనుల్లో నాణ్యత, అవినీతిపై రిటైర్డు హైకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం కోతకు గురైన ఏటిగట్టును పరిశీలించారు. పనులు చేపట్టిన ఆరు నెలల కాలంలో గట్టు కుంగడం ఇది నాల్గోవసారి.ప్రజలు భయంతో బిక్కుబిక్కుమని గడుపుతుంటే అధికారులకు చీమకుట్టినట్టయినా లేదు. విచారణ వచ్చిన ఇంజనీర్ల బృందం ఎమ్మెల్యే ముదునూరి రాసిన స్క్రిప్ట్ చదివి వెళ్లారే తప్ప పనులు పరి శీలించ లేదు. భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ నిలదీశారు. రూ.27 కోట్లతో జరుగుతున్న ఈ పనులకు ముదునూరి బినామీ, అందువల్లే పనులు పరిశీలించేందుకు కూడా అధికారు లెవరూ సాహసించడం లేదు. మరో నెలరోజుల్లో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. ముటాముళ్లు సర్దుకుని స్వగ్రామం వెళ్లక తప్పదు. అప్పుడు అవినీతికి కొమ్ముకాస్తున్న అధికారులు బలవుతారు. అధికారులు ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడకుండా పనుల నాణ్యతపై శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. పొన్నమండ నాగేశ్వరరావు, చిటికెల రామ్మోహన్, అంగ్రాజు రామన్న, తంగేళ్ళ నాగేశ్వరరావు, సత్యనారాయరాజు, రేవు ప్రభుదాసు, కె.శ్రీను, హేమలత, సురేష్, చాగంటి ఆనంద్, దానియేలు, మల్లిక్, రెడ్డిం శ్రీను, పి.శ్రీధర్‌లు పాల్గొన్నారు.



మంచు ముసుగు 7



దొరికినంత దోచేయ్ !

- అధికార పార్టీ ఇసుక దోపిడీ
- లెక్కా పత్రం లేకుండా తవ్వకాలు
- అనుమతులు లేకున్నా తరలింపు
- జగనన్న కాలనీల పేరుతో బొండు ఇసుక వ్యాపారం
- స్థానిక సంస్థలకు సీనరేజి చెల్లించని ప్రభుత్వం

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గుట్టు చప్పుడు కాకుండా ఇసుక దోపిడీ సాగుతోంది. లెక్కాపత్రం లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారు. అనుమతులతో ప్రమేయం లేదు. మైనింగ్ శాఖ పరిమితులతో అవసరం లేదు. అధికార పార్టీని అడ్డం పెట్టుకొని ర్యాంప్‌ల్లో దందా సాగిస్తున్నారు. ప్రైవేటు కాంట్రాక్ట్ పేరుతో ప్రజా ప్రతినిధులు బొక్కేస్తున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

బొండు ఇసుక వ్యాపారాలను రవాణా చేసి అధికార పార్టీ నేతలు కోట్ల రూపా యలు కొల్లగొట్టారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో సంస్థకు ఇసుక ర్యాంప్‌లు తవ్వకోమని అను మతి ఇచ్చింది. సదరు సంస్థ కూడా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి సమీప బంధువు కనుసన్నల్లో ఉంటుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఆరు ర్యాంప్‌లకు టెండర్ ఖరారు చేశారు. ఇంకా ప్రభుత్వం అధికారికంగా అను మతి ఇవ్వలేదు. అయినా తవ్వకాలు చేస్తున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిస్తే తవ్వకాలు నిలిపి వేస్తు న్నారు. లేదంటే తవ్వి సరఫరా చేస్తున్నారు. హరిత ట్రిబ్యునల్ నివేదిక కోరితే మాత్రం తవ్వకాలు నిర్వహించడం లేదంటూ నివేదికలు ఇస్తున్నారు. పరిమితికి లోబడే తవ్వుతున్నట్టు మభ్య పెడుతున్నారు.

ఇసుక ఉన్నా ధర అధికం

ప్రైవేటు సంస్థకు అప్పగించిన తర్వాత ఇసుక అమ్మకాలు ధరలు పెరిగిపోయాయి. గతంలో రూ. 10 వేలకు లభ్యమయ్యే లారీ ఇసుక ఇప్పుడు రూ.15 వేలకు చేరింది. ఒక్కోసారి అది రూ.18 వేలకు విక్రయిస్తున్నారు. ప్రైవేటు సంస్థకు అప్ప గించిన తర్వాత ఇసుక విరివిగా లభ్యమవు తోంది. అయితే ధరలు మాత్రం దిగిరాలేదు. ధరలను పెంచేశారు. గత ప్రభుత్వం కంటే లారీకి అదనంగా రూ. 5 వేలు వసూలు చేస్తున్నారు. పైగా తెలుగుదేశం హయాంలో ఇసుక దందా సాగిందంటూ అధికార పార్టీ నేతలు దబాయిస్తున్నారు. అధికా రికంగా ఇప్పుడు దోపిడీకి పాల్పడుతున్నారు.

ఎక్కడా లెక్కల్లేవు

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఇసుక తవ్వకాలపై లెక్కా పత్రం లేకుండా పోయింది. ఒకే బిల్లుపై రెండు మూడు లారీల ఇసుక సరఫరా చేయడం సర్వసాధారణ మైపోయింది. ర్యాంప్ రహదారి పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారు. చిన్న వాహనానికి రూ. 300, పెద్ద వాహనానికి రూ. 400 వంతున రవాణా యజమానులు చెల్లిస్తున్నారు. ఇసుక ధరలతో పాటు బాట చార్జీలు చెల్లించి ఇసుక రవాణా చేస్తున్నారు. రవాణా చార్జీలు కలుపుకొని వినియోగదారులకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల బాట చార్జీలను పెంచేశారు. అదనంగా రూ. 1200 వరకు చెల్లించాలని పట్టు బట్టారు. దాంతో లారీ యజమానులు సమ్మెకు దిగారు. ఇసుక రవాణా నిలిపివేశారు. దాంతో బాట చార్జీలపై ర్యాంప్ నిర్వాహకులు దిగొచ్చారు. యథావిధిగా చిన్నలారీకి రూ.300 , పెద్దలారీ అయితే రూ.400 చెల్లిస్తున్నారు. ఇదంతా అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళుతోంది. లెక్కకు మిక్కిలి విక్ర యాలు సాగిస్తూ కాంట్రాక్ట్ సంస్థ పేరుతో అధికార పార్టీ నేతలు దోచుకుంటున్నారు. ఇసుక దందాలో రాష్ట్రస్థాయి నేతల వరకు జేబులు నిండుతున్నాయన్న విమర్శలు సాధారణమై పోయాయి.



సీనరేజి ఎగనామం

ఇసుక ర్యాంప్‌లపై సీనరేజీని చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. జిల్లాలో ప్రధానంగా సిద్ధాంతం, నడిపూడి, కోడూరు, దొడ్డిపట్ల, వడ్డిలంక, అబ్బిరాజు పాలెం తదితర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు అధికంగా ఉంటాయి. సదరు పంచాయతీలకు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు సీనరేజీ చెల్లించాలి.ప్రభుత్వం గడచిన రెండేళ్ల నుంచి బకాయి పడింది. సీనరేజీ జమ చేయకపోవడంతో పంచాయతీలకు నష్టం వాటిల్లుతోంది. ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేకపోతున్నారు. ఇసుక తవ్వకాలపై స్థానిక సంస్థలకు లెక్క తెలియడం లేదు. క్షేత్రస్థాయి ప్రభుత్వ సిబ్బందికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే విధులు నిర్వహిస్తున్నారు, చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారు. విజిలెన్స్ తనిఖీలు కూడా ఉండడం లేదు. మైనింగ్ శాఖ తవ్వకాలపై పట్టించుకోవడం లేదు.

జగనన్న కాలనీల పేరుతో దందా

జగనన్న కాలనీలకు పూడిక చేయాలంటూ అధికార పార్టీ నేతలు ఇసుక వ్యాపారాలు చేసేశారు. బొండు ఇసుకను తరలించేశారు. కోట్ల రూపాయలు మూటగట్టుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలు కూడా దందాలో భాగస్వాములయ్యారు. జిల్లా అధికార పార్టీ నేతలు సైతం జగనన్న కాలనీల పేరుతో ఇతర ప్రాంతాలకు బొండు ఇసుకను తరలించేశారు. జిల్లాలో ఇదో పెద్ద వ్యాపారంగా మారింది. ర్యాంప్‌లను సబ్ లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్‌లు నష్టాలను చవిచూశారు. అధికార పార్టీ నేతలు కాసులు పోగేసుకున్నారు. ఇప్పటికీ అనుమతులు లేని ర్యాంప్‌ల నుంచి తవ్వకాలు సాగిస్తున్నారు. మొగల్తూరు సముద్ర తీరంలోనూ ఇసుక అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎన్జీవో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన

భీమవరం ఫిబ్రవరి 15 : భీమవరం తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తాలూకా జేఏసీ ఛైర్మన్ జానకిరావు అధ్యక్ష అధ్యక్షతన ఆందోళన చేశారు. కృష్ణ, గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఈ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయులకు ద్రోహం చేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఉద్యోగులు దాచు కున్న సొమ్ములు దాదాపు 22 వేల కోట్లు రూపాయలు వారికి ఇవ్వకుండా తన సొంత అవసరాలకు వాడుకుని దొంగ లెక్కలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. 11వ పీఆర్సీ పూర్తిగా అమలు చేయకుండా 12వ పీఆర్సీ ఏ విధంగా అమలు చేస్తారన్నారు. బకాయిలు విడుదలయ్యే వరకు ఐక్యంగా పోరాటం చెయ్యాలని, పోరాటానికి పీడీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియ జేస్తుందన్నారు. ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, ఓపీఎస్ అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. 17న జరిగే తాలూక స్థాయి నిరసన ర్యాలీ, ధర్నా, 20న జిల్లాస్థాయి నిరసన ర్యాలీ, ధర్నా జయప్రదం చేయాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కామరాజు, అప్పారావు, కుమార్ స్వామి, పట్టాభి రామయ్య, కుమార్ బాబ్జీ, త్రినాథ్,రామకృష్ణ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్లో నిర్వహించనున్నట్లు కలెక్టరు పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో స్పందన సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఉద్యోగుల గ్రీవెన్స్ ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు ఎవరైనా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లదలచిన ఉద్యోగులకు అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కోరారు.

టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలకు కృషి

» పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో వెంకటరమణ


టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటరమణ

ఆకివీడు, ఫిబ్రవరి 15: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ ఏడాది జిల్లాలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక చేపట్టామని పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించి విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 386 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలున్నాయని వాటిలో 24 వేలమంది విద్యార్థులున్నారన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీ,డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు ఏఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో సంబంధిత ఉపాధ్యాయులు దత్తత తీసుకుని తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఉదయం, సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తయాచు చేయించిన మెటీరిల్‌ను ఆన్‌లైన్‌లో పెట్టామన్నారు. పాఠశాల హెచ్‌ఎం తోట పోతురాజు, ఉపాధ్యాయులు అరవింద్, వెంకటస్వామి, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 15 : ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24లో ఐదో తరగతిలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల్లో చేరేందుకు విద్యార్థులు ఏప్రిల్ పదో తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ఏప్రిల్ 21న పరీక్ష ఉంటుందన్నారు. రాతపరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. రాత పరీక్ష కేఆర్‌పురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలబాలికల పాఠశాలల్లో ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గరలోని గురుకుల విద్యాలయానికి వెళ్లి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● మన్యం జిల్లా, విశాఖపట్నం జిల్లా, ఏలూరు జిల్లాల్లోని పార్వతీపురం, జోగంపేట, మారికవలస, విస్సన్నపేట ప్రాంతాల్లోని ప్రతిభ పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఎనిమిదో తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మార్చి 25వ తేదీ లోగా, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన కేఆర్ పురంలోని గురుకుల బాలుర పాఠశాలలో జరుగుతుందన్నారు.

మృదుల కుమారికి 'స్త్రీశక్తి పురస్కారం'


మృదుల కుమారి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 : గాంధేయ మహిళ చర్ల మృదుల కుమారి 'స్త్రీశక్తి-2024' పురస్కారానికి ఎంపిక చేశామని సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపా రు. గత 50 ఏళ్లుగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఆమె పలుసేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. సర్వోదయ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 16న ఈ అవార్డును ఆమెకు అందజేస్తామని తెలిపారు.

రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు చింతలపూడి విద్యార్థినులు



రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థినులు

చింతలపూడి, ఫిబ్రవరి 15 : చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు వి.భార్గవి, వి.నవ్యశ్రీ రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మాటూరి చక్రధరరావు తెలిపారు. కొవ్వలి హైస్కూలులో ఈనెల 14న జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని 'ఉమెన్ సేఫ్టీ డివైస్' అనే టాపిక్‌ను ప్రదర్శించారు. ఈ డివైస్‌తో ప్రతీ బాలిక లేక మహిళ అనుకోకుండా ప్రమాదానికి గురైతే ఆ ప్రమాదం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు డివైస్ ద్వారా ప్రదర్శన చూపారు. ఈ ప్రదర్శనను ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ అమిత్ జైన్ ప్రశంసించారు. చిత్తూరు జిల్లాలో ఈనెల 18న జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థినులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు గైడ్ టీచర్స్ ఆర్.సత్యకుమారి, ఎం.డి.షర్మిలను పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



విలేకరులతో మాట్లాడుతున్న మేరీ గ్రేస్‌కుమారి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, చిట్‌ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ తగాదాలు తదితర కేసులను రాజీ చేస్తామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌కు ఏడువేల కేసులను రాజీయోగ్యమైన కేసులుగా గుర్తించామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కేసుల మధ్యవర్తిత్వానికి హాజరుకాలేని దూర ప్రాంతాల్లో నివసిస్తున్న కక్షిదారులు ఆన్‌లైన్ మార్గం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉపయోగించుకుని రాబోయే లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.


మార్టేరు పరిశోధన కేంద్రం కాంట్రాక్టు కార్మికుల నిరసన

నేటి నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

పెనుమంట్ర, ఫిబ్రవరి 15 : మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. గురువారం మూడో రోజుకి చేరుకున్న ఆందోళనలు.. 16వతేదీ నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తారని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పెనుమంట్ర మండల సీఐటీయూ కార్యదర్శి కోడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వల్ల పరిశోధనా కేంద్రంలోని వరి పంటలు దెబ్బతినే పరిస్థితి వచ్చిందన్నారు. ఏళ్ల తరబడి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించిందని వెల్లడించారు. ఉభయ గోదావరి జిల్లాల వేలాది రైతులకు వేగుచుక్కగా ఉన్న మార్టేరు వరి పరిశోధనా కేంద్రం నూతన వరి వంగడాలు ఆవిష్కరించి అందజేస్తున్నదని, అటువంటి ముఖ్యమైన పరిశోధనా స్థానంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వానికి పెద్దసమస్య కాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ నాయకురాలు దమ్ము నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, వెలగల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

శోభనాచలస్వామి గరుడోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 15: ఆగిరిపల్లి రథసప్తమి తిరునాళ్ళ సందర్భంగా గురువారం శోభనాచలస్వామి పెద్దగరుడ వాహనంపై విహరించారు. ఉదయం శాంతి కల్యాణంలో భాగంగా ఆకుల బసవా ప్రసాద్ సాయంత్రం జరిగే నిత్యకల్యాణంలో భాగంగా కమ్మ సంఘం ఆధ్వర్యంలో మాదల శివరామ్‌ప్రసాద్ దంపతులు కైంకర్య పరులుగా పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

వాడవల్లిలో రూ.2.03 లక్షల చోరీ

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 15: వాడవల్లి గ్రామానికి చెందిన దూసనపూడి గురుబ్రహ్మం మంగళవారం ఇంటికి తాళం వేసి వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లి బుధవారం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో దాచి ఉంచిన రూ. 2.03 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించి బాధితుడు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వెంకటకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కమ్మేసిన మంచు




దువ్వ వద్ద హైవేపై..


భీమవరం రైల్వే వంతెనపై మంచు

కైకరం వద్ద హైవేపై కురుస్తున్న మంచు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 15: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుఝామున మంచు కమ్మేసింది. విపరీతంగా పేరుకుపోయి మంచుదుప్పటిలా ఏర్పడింది. ఉదయం సమయంలో రహదారులు కనిపించకపోవడంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. చాలామంది ప్రయాణికులు తమ వాహనాలను రహదారుల పక్కన నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం సమయంలో ప్రజలు బయటకు వెళితే శ్వాసకోశ సంబంధమైన వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్యాల పాలవుతున్నారు. రాత్రి సమయం మాదిరిగా వాహనాల లైట్లు వేసుకుని నడపాల్సి వచ్చింది. వేసవి కాలం దగ్గర పడుతున్న సమయంలో మంచు విపరీతంగా కురియటంతో పంటలు దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా మామిడితోటలో పూత మాడిపోతుందని, మంగు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని రైతులు చెబుతు న్నారు. రబీ సాగు ఆరంభించిన సమయంలో తెల్లవారు ఝాము సమయంలోనే వ్యవసాయ కూలీలు, రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు ఏలూరు జిల్లాలో 34 నుంచి 35 డిగ్రీల వరకు నమోదయ్యాయని, రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రత లు 22 నుంచి 18 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయాయి. పశ్చిమ జిల్లాలో 32 నుంచి 35 వరకు నమోదయ్యాయని, రాత్రి సమయాల్లో 19 నుంచి 16 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయాయి.


జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో మంచు

● మంచు ఎక్కువగా కురిసే సమయంలో రహదారులపై బహిరంగంగా ప్రయాణించడం ఆరోగ్యానికి మంచిది కాదని, ఆ సమయంలో జాగ్రత్తలు తీసుకుని బయటకు వెళ్ళాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం సమయాల్లో వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవాలి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పెరిగిన మంచు

- » రాత్రి సమయాల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- » మంచులో ప్రయాణాలు ప్రమాదకరం
- » ఇబ్బందులు పడుతున్న రైతులు

ఉమ్మడి పశ్చిమలో ఉష్ణోగ్రతలు ఇలా..

రోజు	ఏలూరు జిల్లా (పగలు/రాత్రి)	పశ్చిమ జిల్లా (పగలు/రాత్రి)
ఫిబ్రవరి 9	35/22	35/18
10వ తేదీ	35/21	33/19
11వ తేదీ	34/19	35/18
12వ తేదీ	34/18	32/16
13వ తేదీ	34/18	35/18
14వ తేదీ	34/18	32/16
15వ తేదీ	35/18	34/18


పెదవేగిలో మంచు


ఆకివీడులో కురుస్తున్న మంచు

ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలి



కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచు కారణంగా రోగాలు బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ప్రతీ ఒక్కరూ మాస్క్ ధరించాల్సిందే. చెవులు, ముక్కు కప్పుకునే విధంగా ఉండాలి. అవసరమైతే మంకీ క్యాప్ మంచిది. బయటకు వెళ్ళే మహిళలు, చిన్నపిల్లలు చెవుల్లో కాటన్ పెట్టుకుంటే మంచిది. వైరల్ ఫీవర్లు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సత్యసంజీవ్ చిక్కం, ఎండి హోమియోపతి, భీమవరం

క్రైం కార్నర్

బస్సును ఢీకొట్టిన లారీ

27 మందికి గాయాలు
ఏలూరు ఆస్పత్రికి ఐదుగురి తరలింపు


ఆర్టీసీ బస్సు


జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులకు వైద్యం


బాధితులను పరామర్శిస్తున్న ఆర్టీసీ డీఎం గంగాధర్, సిబ్బంది

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 15:ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో 27 మంది ప్రయాణికులు గాయాల పాలైన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలోని హైవేపై జరిగింది. ఎవరికి ప్రాణ నష్టం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో నైట్ అవుట్ చేసి గురువారం ఉదయం జంగారెడ్డిగూడెం బయలు దేరింది. వయా తెల్లంవారిగూడెం, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం మీదుగా 57 మంది ప్రయాణికులతో వస్తున్న బస్సు మరో ఐదు నిమిషాల్లో పట్టణానికి చేరుకునే క్రమంలో అశ్వారావుపేట నుంచి రాజమండ్రి వైపునకు వెళ్తున్న లారీ.. బస్సు వెనుక ఎమర్జెన్సీ డోర్ వద్ద బలంగా ఢీ కొంది. బస్సులో ఉన్న 27 మందికి గాయాలయ్యాయి. స్థానికులు ప్రయాణికులను బస్సులోనుంచి దించి అటుగా వెళ్తున్న ఆటోలపై స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందించి తీవ్రంగా గాయపడిన ఐదుగురు నక్కా అలివేలు, మోత్రపు సందీప్, పుంజుగల పవన్‌కుమార్, కొరసా రామసీత, జుత్తుగ ఇందిరలను మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సురేశ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విషయం తెలుసుకున్న క్షతగాత్రుల బంధువులు, స్నేహితులు ఆసుపత్రికి చేరడంతో ఆసుపత్రి అంతా జనంతో నిండిపోయింది.

● జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బస్సు ప్రమాద బాధితులను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు, జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ పొల్నాటి బాబ్జి, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం తదితరులు పరామర్శించారు.

ఆర్టీసీ బస్సు-వ్యాన్ ఢీ

డ్రైవర్, ఇద్దరు ప్రయాణికులకు గాయాలు


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు


బస్సు-వ్యాన్ ఢీకొన్న దృశ్యం

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 15 : జీలుగుమిల్లి హైవేపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు, ఐషర్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ టి.రమేష్ వ్యాన్‌లో ఇరుక్కుపోయాడు. ఎస్‌ఐ వి.చంద్రశేఖర్ స్థానికులు కలసి వ్యాన్ ముందు భాగం ట్రాక్టరు సాయంతో లాగి ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జంగారెడ్డిగూడెం నుంచి వేలేరుపాడు నైట్ హాల్ట్ బస్సు వెళుతుంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం ప్లాస్టిక్ పైపులు తరలిస్తున్న వ్యాన్ రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. డ్రైవర్‌కు తలకు, మోకాళ్లకు గాయాలు కాగా వేలేరుపాడుకు చెందిన వృద్ధురాలు తూం మంగమ్మ, శివకాసీపురానికి చెందిన లీలాకుమారికి గాయా లు కావడంతో జీలుగుమిల్లి పీహెచ్‌సీలో వైద్యం పొందారు. ఆర్టీసీ బస్సులో వేలేరుపా డుకు చెందిన వారు వంద మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిపారు. సంఘటన స్థలం వద్ద ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు. జీలుగుమిల్లి ప్రధాన నాల్గు రోడ్డు కూడలిలో పలు దుకాణాలు సైతం రోడ్డుపైకి చొచ్చుకు వచ్చి వ్యాపారాలు సాగిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామన్నారు.

నేల బావిలో పడి వ్యక్తి మృతి


రవి మృతదేహం

లింగపాలెం, ఫిబ్రవరి 15: ప్రమాదవశాత్తు నేలబావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. చింతలపూడి మండలం బాలవారి గూడెం గ్రామానికి చెందిన రాయల రవి(23)అనే వ్యక్తి గ్రామానికి వచ్చి బయటకు వెళ్ళినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామంలోని ఓ నేల బావిలో వ్యక్తి మృతదేహం గుర్తించామని, అతడు రాయల రవిగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ రాంబాబు తెలిపారు. రాయల రవి మృతిపై గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 15 :భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనాకోడేరు కాల్వలో కాళ్ళ మండలం కోనాలపల్లికి చెందిన సిరింగి విస్సాకు(52) మృతదేహాన్ని గుర్తించినట్టు టూటౌన్ ఎస్‌ఐ జీజే ప్రసాద్ గురువారం తెలిపారు. విస్సాకు అనే వ్యక్తి మతిస్థితమితం లేకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గురువారం ఉదయం అనాకోడేరు కాల్వలో మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో వివరాలు సేకరిస్తుండగా మృతుడి సోదరుడు డేవిడ్ గుర్తించారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

పెనుమంట్ర,ఫిబ్రవరి 15 : బ్రాహ్మణచెరువు కొండాలమ్మ గుడి వద్ద ఇసుక లారీ బోల్తా కొట్టింది. మార్టేరు నుంచి బ్రాహ్మణ చెరువు వస్తున్న సమయంలో మంచు వల్ల దారి కనిపించకపోవడంతో ఇసుక లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభం వల్ల బోల్తా కొట్టింది. ఎలక్ట్రికల్ స్తంభాన్ని ఢీకొట్టడం వల్ల విద్యుత్ వైర్లు తెగి రోడ్లపై పడి కరెంట్ షాక్ గురయ్యేవారని... స్తంభం శిథిలం కాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు చెబుతున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు, ఫిబ్రవరి 15: ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్‌లోని తీగలదొడ్డి దగ్గర మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపారు. మద్యం అమ్ముతున్నట్టు సమాచారంతో గురువారం దాడి చేసి అతడి వద్ద నుంచి 180 ఎంఎల్ బాటిల్స్-4, నాలుగు బీర్ల సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

భోగోలులో వృద్ధురాలి మృతి

లింగపాలెం, ఫిబ్రవరి 15: భోగోలు గ్రామంలో మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. భోగోలు గ్రామానికి చెందిన తాడేపల్లి భాగ్యం(68)అనే మహిళ మతిస్థిమితం లేకుండా ఉంటుంది. బుధవారం కుటుంబసభ్యులు పనికి వెళ్లగా ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి పడిపోయినట్టు తెలిపారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా ధర్మాజీగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మరణించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 15 : విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ డి. దుర్గామహేశ్వరరావు తెలిపారు. కామవరపుకోట మండలం వీరభద్రకాలనీకి చెందిన బుంగా రవి కుమారుడు సాయి(21) కరెంటు పనులకు వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీన మక్కినవారిగూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కరెంట్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయాడు. యువకుడి బంధువులు విజయవాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

తణుకు జనరల్ స్టోర్‌లో చోరీకి యత్నం


చోరీకి ప్రయత్నించిన షాపు

తణుకు, ఫిబ్రవరి 15 : తణుకు పట్టణంలోని సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న ఓ జనరల్ స్టోర్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీకి ప్రయత్నం చేశారు. ఈఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. బాలకృష్ణ అనే వ్యాపారికి చెందిన జనరల్ స్టోర్ షట్టర్ పగులకొట్టేందుకు ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చారు. గడ్డర్లతో వచ్చిన దుండగులు షట్టర్ పగులకొట్టేందుకు ప్రయత్నించినప్పటికీ రాకపోవడంతో వెనుతిరిగారు. ఈ ఘటనలన్నీ సీసీ ఫుటేజీలో నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల జోలికొస్తే తాటతీస్తాం

» 60 రోజుల తర్వాత అందరి లెక్కలు తేలుస్తాం : చింతమనేని


గాయపడిన డాక్టర్ మధును పరామర్శిస్తున్న చింతమనేని ప్రభాకర్

దెందులూరు, ఫిబ్రవరి 15 : 'అన్యాయంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే తాటతీస్తాం. పార్టీ శ్రేణులందరూ ధైర్యంగా ఉండాలి. 60 రోజుల్లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తాం' అని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు హెచ్చరించారు. ఇటీవల లక్ష్మీపురం సమీపంలో రాత్రి సమయాల్లో అక్రమంగా పోలవరం కాల్వ మట్టిని వైసీపీ నేతలు తరలిస్తుండగా అడ్డుకున్న టీడీపీ సీనియర్ నేత డాక్టర్ పసుమర్తి మధుపై వైసీపీ నేతలు మూకుమ్మడి దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిలో గాయాలపాలై హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన మధు ఇంటికెళ్లి గురువారం పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ చెరువులు, పోలవరం కాల్వ అక్రమ మైనింగ్ మట్టి తరలింపుపై ప్రశ్నించే టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి అన్యాయంగా పోలీసులను ఉపయోగించుకుని తిరిగి బాధితులపైనే కేసులు పెడుతున్నారన్నాని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నాని, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణం ఱప్పిలి వెంకటేశ్వరావు, గారపాటి కొండయ్యచౌదరి, పెనుబోయిన మహేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో సినీనటుడు క్రాంతికుమార్


ఆలయ ప్రాంగణంలో కుటుంబసమేతంగా నటుడు క్రాంతి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 15: చినవెంకన్న ఆలయాన్ని సినీనటుడు క్రాంతికుమార్ గురువారం కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకు న్నారు. ఉప్పెన సినిమాలో తాను ఒక మంచి పాత్రను పోషించినట్లు తెలిపారు. స్వామి వారి దర్శనం సంతోషం కలిగించిందన్నారు.

పవన్ కల్యాణ్‌కు జోగయ్య లేఖ

పాలకొల్లు, ఫిబ్రవరి 15 : జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు గురువారం రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య లేఖ రాశారు. ఈ మేరకు లేఖలోని అంశాలను గురువారం విలేకరులకు వివరించారు. రాష్ట్రంలో 25 శాతం జనాభా ఉన్న కాపు, ఒంటరి బలిజ, తూర్పుకాపు కులస్తులకు తగిన రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 41 అసెంబ్లీ స్థానాలు, ఆరు పార్లమెంట్ స్థానాలను కాపులకు ఇవ్వాలని కోరారు. అయా స్థానాల్లో పోటీకి నిలపాల్సిన అభ్యర్థుల పేర్లను కూడా సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో-6, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా-7, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు-5, విశాఖ జిల్లా-7, కృష్ణా జిల్లా-3, గుంటూరు-2, నెల్లూరు జిల్లా-1, ప్రకాశం జిల్లా -1, రాయలసీమ నాలుగు జిల్లాల్లో-9 స్థానాలను జనసేన పార్టీకి కేటాయించాలని సూచించారు. నరసాపురం, కాకినాడ, మచిలీపట్నం, అనకాపల్లి, రాజంపేట, విజయనగరం ఆరు పార్లమెంట్ స్థానాలను కాపులకు కేటాయించాలని జోగయ్య కోరారు.

సైనికోద్యోగి రమేష్‌బాబుకు అంతిమ వీడ్కోలు


రమేష్‌బాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15: కోల్‌కత రెజిమెంట్‌లో విధులు నిర్వహిస్తున్న తాడేపల్లిగూడెంలోని సత్యవతినగర్‌కు చెందిన జగజ్యోతుల రమేష్‌బా బుకు బుధవారం సైనికోద్యోగులు అంతిమ వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో కోల్‌కత ఆర్మీ ఆసుపత్రిలో మంగళవారం తుదిశ్వాస విడిచిన రమేష్ బాబు మృతదేహాన్ని ప్రత్యేక విమానం ద్వారా హైదరాబాద్ తరలించి అక్కడ నుంచి అంబులెన్స్ ద్వారా గురువారం తాడేపల్లిగూడెంకు తరలించారు. తాడేపల్లిగూడెంలో ఎన్‌సీసీ డ్రిల్ ర్యాలీగా మృతదేహాన్ని పాతూరు రుద్రభూ మికి తరలించి అంతిమ సం స్కారాలు నిర్వహించారు. అతని మృతదేహానికి ఆర్మీ ఉన్నతాధికారులు కమాం డ్ కర్నల్ సౌరబ్ ముఖర్జీ, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, సుభేదార్ ఆదినా రాఆయణ, సుభేదార్ దేమిని తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఏజెన్సీలో నాటు తుపాకీ స్వాధీనం

పోలవరం, ఫిబ్రవరి 15 : పోలవరం ఏజెన్సీలోని గుంజవరం గ్రామ మొక్కజొన్న తోటలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన ఎస్‌ఐ పవన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు వీర్వోలు, మధ్యవర్తులతో మొక్కజొన్న తోటలో దాచి ఉంచిన నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు చుట్టుపక్కల వారిని విచారించగా ఎవరిదీ కాదనడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.


ఆదర్శ ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం సత్యనారాయణమూర్తి

ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు అభినందన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 15 : డిపోలో ఆదాయం తీసుకురావటంలో ప్రతిభ కనపరిచిన కండక్టర్లను, అత్యధిక కెఎంపీలను తీసుకువచ్చిన డ్రైవర్లను మిగతా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని భీమవరం డిపో మేనేజర్ వీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి అన్నారు. జనవరి నెలలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన ఉత్తమ ఉద్యోగులు ఎస్‌వీఎస్‌ఏరావుకు ప్రథమ స్థానం, కేవీరావుకు ద్వితీయ స్థానం, ఎ.నారాయణ తృతీయ స్థానంలో నిలిచారని అన్నారు. అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన ఉత్తమ కండక్టర్లు వి.రాంబాబుకు ప్రథమ స్థానం, కె.శ్రీరాములు ద్వితీయ, తృతీయ స్థానంలో టీవీఎస్ఎం లక్ష్మి నిలిచారని అన్నారు. వీరికి నగదు, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 15 : భీమవరం డిపో పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను అందించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్ ద్వారా తెలియజేసి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఫోన్ 99592 25485 నెంబర్‌కు చెయ్యాలన్నారు.

కాంగ్రెస్ నుంచి పోటీకి యాదవ్ దరఖాస్తు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 15: భీమవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయటానికి అవకాశం కల్పించాలని కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు కొర్రా శ్రీనివాస్ యాదవ్ విజయవాడ ఆంధ్ర రతన్ భవన్‌లో దరఖాస్తు చేసినట్లు గురువారం తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు విజయవాడ కాంగ్రెసు పార్టీ సిటీ ప్రెసిడెంట్ నరహరిశెట్టి నరసింహారావు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అద్దంకి దొరబాబు, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ పుచ్చకాయల రత్నరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


డ్రైవర్లకు కళ్ళజోళ్లు పంపిణీ చేస్తున్న టి.ఉమామహేశ్వరరావు

భీమవరం రూరల్, ఫిబ్రవరి 15 : ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తే ప్రమాదాల నివారణకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా రవాణాశాఖ అధికారి టి. ఉమామహేశ్వరరావు కళాశాలలను కోరారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఎస్ఆర్‌కేఆర్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణాశాఖ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో 60శాతం మంది విద్యార్థి, యువత ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులు వాహనాలను నడిపే సమయంలో ఎదుట వచ్చే వాహనాలను కూడా గమనించాలన్నారు. భీమవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దాస్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణరాజు, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లుకు ఉచిత కంటి పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి దాతల సహకారంతో కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు.

'గట్టు పనుల్లో అవినీతి లేదు'


కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ముదునూరి

నరసాపురం, ఫిబ్రవరి 15: ఏటిగట్టు పనుల్లో అవినీతికి తావులేదని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు స్పష్టం చేశారు. కోతకు గురి అవుతున్న ప్రాంతం ఒంపులో ఉంది. నది ప్రవాహం సూటిగా వచ్చి ఆ ఒంపును తాకడం వల్ల గట్టు జారడం జరుగుతుందే తప్ప పనుల్లో నాణ్యత లోపం కాదన్నారు. గురువారం కోతకు గురైన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఏటిగట్టు పనులు తాత్కాలికమైనవి కావు, శాశ్వత ప్రతిపాదికన నిర్మిస్తున్నాం, అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి, వీటిని నమ్మొద్దని కోరారు. ఏఎంసీ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, ఛైర్‌పర్సన్ వెంకటరమణ, జయరాజు, మల్లాడి బుజ్జీ, రెడ్డప్ప ధవేజీ, పీతల ప్రసాద్, గోరు సత్తిబాబు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఏ) మూడు సంవత్సరాలకు గాను గుర్తింపు లభించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి నిశాంత్‌వర్మ చెప్పారు. గత డిసెంబర్ నెలలో ఎన్‌బీఏ బృందం కళాశాలలో పర్యటించిందన్నారు. కళాశాలలోని అన్ని అంశాలు పరిగణలోకి తీసుకొని మూడు సంవత్సరాల కాల పరిమితికి గాను తమకు అరుదైన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.

యోగాపై అవగాహన పెంచుకోవాలి

గణపవరం, ఫిబ్రవరి 15: ఆధునిక యుగంలో యోగా సర్వరోగ నివారిణి అని, యోగా సాధన వల్ల ఆరోగ్యంగా ఉంటారని స్థానిక లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టారు పెరుమాళ్ళ మురళి అన్నారు. గణపవరంలోని ధ్యాన కేంద్రంలో గురువారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిళ్లను అధిగమించి ప్రశాంతంగా ఉండేందుకు యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు. మరోఅతిథి పిరమిడ్ మాస్టారు పెరుమాళ్ళ మహాలక్ష్మి మాట్లాడుతూ యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఉరదాళ్ల శ్రీహరితో పాటు శివాజీ, కామరాజు, పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరించాలి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 15 : క్రీస్తు బోధనలు ఆచరించాలని ది లేమెన్స్ ఇవాంజలికల్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు దానియేలు మనవడు కాలేబ్ డానియేలు, సురేష్ మార్కస్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సి.జయంతరావు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


నూతనంగా ఎన్నికైన కమిటీ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15: దేశంలోని 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు వీవీ ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం మార్కెట్‌లో బుధవారం ఉల్లిపాయల మార్కెట్ జట్టు యూనియన్ వార్షికోత్సవం చల్లా చంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, మండల కన్వీనర్ పుల్లారెడ్డి ప్రసంగించారు. అనంతరం తాడేపల్లిగూడెం ఉల్లిపాయల జట్టు యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా సిరపరపు రంగారావు, గౌరవ అధ్యక్షుడిగా చల్లా చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా గొర్లి శ్రీను, సహాయ కార్యదర్శిగా కాకర వెంటరావు, కమాండర్‌గా బంకూరి నాగేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15: మహిళలు ఆర్థికంగా నిలబడితేనే ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో విద్యలో ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులను, ఏరియా ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యులను, ఉత్తమ సేవలందిస్తున్న ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్‌ను సత్కరించారు. ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కమిషనర్ ఎ.శామ్యూల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి. సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీవో సరస్వతి, సూపర్‌వైజర్లు భవాని, విశాలాక్షి, ఎస్తేరురాణి పాల్గొన్నారు.





అప్పన్నచెర్వు గ్రామంలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర.. నరసాపురంలో బూత్ కన్వీనర్లతో మాట్లాడుతున్న పొత్తూరి.. తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న వలవల బాబ్జి.. తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

'జగన్ అరాచక పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే'

పోడూరు, ఫిబ్రవరి 15: ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలేనని పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. పోడూరు మండలం అప్పన్నచెర్వు గ్రామంలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. జగన్ పాలనను ఎండగడుతూ వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పేదలు, మహిళలు కోసం చేపట్టనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: పూలపల్లి గ్రామంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటికి సురక్షితమైన మంచినీరు అందిస్తామని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా నాల్గవ రోజు గురువారం పూలపల్లిలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధి భగవాన్ రాజు, జనసేన జిల్లా నాయకులు బోనం చిన్నబాబు తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మలకు అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి నుదుట కుంకుమ దిద్ది నీరాజనాలు పలికారు.


చినకాపవరంలో ప్రచారంలో భాగంగా తాపీ పని చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు

ఓటర్ల జాబితా పరిశీలించాలి

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 15: ఓటర్ల చేర్పు, తొలగింపుల్లో అధికార పార్టీ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని, బూత్‌లవారీగా ఓటర్ల జాబితాను పరిశీలించాలని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, సీనియర్ నాయకులు కొవ్వలి నాయుడు ఆదేశించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న ఓట్లు, కొత్తగా చేర్చినవి, తొలగించినవి పరిశీలించారు. మృతి చెందిన వారి ఓట్లు ఉంటే గుర్తించాలన్నారు. ఎన్నికలు జరిగే వరకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. పొత్తులో టిక్కెట్ ఎవరికొచ్చినా ఐక్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమా, గుబ్బల నాగరాజు, పొన్నాల నాగబాబు, అధికార అనంతరామారావు, కొరాడా పాపారావు, మల్లాడి మూర్తి, సంకు భాస్కర్‌లు పాల్గొన్నారు.

టిక్కెట్‌పై వదంతులు నమ్మవద్దు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 15: తాడేపల్లిగూడెం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి విషయంలో వస్తున్న వదంతులను నమ్మవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ టిక్కెట్ విషయంపై ఇటీవల జరుగుతున్న ప్రచారంతో పార్టీ శ్రేణులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. అధినేత చంద్రబాబు ఆదేశాలే శాసనంగా భావించి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత చేరువ చేద్దామన్నారు. తొలుత భవిష్యత్‌కు గ్యారెంటీ, ఓటర్ వెరిఫికేషన్ కోసం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన వెంపన ధనరాజు, భూషణంలకు వివరాలను అందజేశారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, గంధం సతీష్, సబ్బీసు కృష్ణమోహన్, ఎరుబండి సతీష్, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అందరికీ అన్యాయం

తణుకు, ఫిబ్రవరి 15: వైసీపీ దుర్మార్గ పాలనలో అందరికీ అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం కోనాల మాజీ సర్పంచ్ బూరుగుపల్లి ఆనంద రమేష్ ఆధ్వర్యంలో వైసీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ సభ్యుడు చిటికిన వీర వెంకట సత్యనారాయణ, ఆకుల రాంబాబు, శ్రీనుతో పాటు పలువురు వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి ఆరిమిల్లి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు గోడవల్లి శ్రీనివాసు, మోతుకూరి సత్యనారాయణ, సకినాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పితానిని కలిసిన బీసీ సెల్ అధికార ప్రతినిధి

పెనుమంట్ర, ఫిబ్రవరి 15 : తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా నియమించిన ఆనచంద్ర ప్రసాద్ గురువారం మంత్రి పితాని సత్యనారాయణను కొమ్ముచిక్కాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలకు ఎంబీసీ సంచారజాతులకు సేవ చేసుకునే అవకాశం తెలుగుదేశంపార్టీ తనకు ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ బీసీలను ఆర్థిక సామాజిక రాజకీయం రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార దేవాంగ కమిటీ కన్వీనర్ బీరక ప్రసాద్, దేవాంగ సాధికారకమిటీ నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ భాస్కరరావు, పవన్ దుర్గారావు పాల్గొన్నారు

బాబుతోనే బంగారు భవిష్యత్

ఆకివీడు రూరల్ ఫిబ్రవరి 15 : బాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. చినకాపవరంలో ఇంటింటికి తెలుగుదేశం, బాబుతోనే బంగారు భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ హయాంలో గ్రామాలలో సురక్షితమైన తాగునీరు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకపోవడంతో ఆ నిధులు నిరుపయోగమయ్యాయని అన్నారు. 2018లో గణపవరం -కలవపూడి రహదారికి నిధులు మంజూరు అయ్యాయని, వాటిని వినియోగించకపోవడంతో కేంద్రం నిధులతో నిర్మిస్తున్నారని తెలిపారు. అక్వారంగాన్ని నాశనం చేసేశారని, ఫీడ్, సీడ్, ధరలు పెంచేశారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాదు, నౌకట్ల రామారావు, మంత్రివాడ వెంకట్రావు, మంత్రివాడ శ్రీనివాసరావు, యర్రంశెట్టిశ్రీను, వడ్డి సత్యనారాయణ, కోపల్లె సాయిబాబా పాల్గొన్నారు.




పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన.. నరసాపురంలో నిరసన.. పోడూరులో ఉద్యోగుల ఆందోళన

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 15:ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే విడుదల చేసి, ఐఆర్‌ని ప్రకటించాలని పాలకొల్లు జేఏసీ అధ్యక్షుడు గుడాల హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాలకొల్లు ఎంపీడీవో, లంకలకోడేరు పీహెచ్‌సీల వద్ద పాలకొల్లు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలు నగదు రూపంలో చెల్లించటానికి కాలయాపన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని, సీపీఎస్ ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వేగేశ్న మురళీ కృష్ణంరాజు, డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.నవ్యజీవన్, యూటీఎఫ్ నాయకులు పిల్లి శ్రీనివాసరావు, ఎస్టీయూ నాయకులు వి.రామ్మోహన్‌రావు, ఎన్జీవో నాయకులు డి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఉద్యోగుల నిరసన

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 15: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో రెండోవ రోజు గురువారం కూడా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్ళ వద్ద నిరసన చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ, మండలంలోని జడ్పీ, మండల పరిషత్, ఎన్‌సీసీ, బీసీ వెల్ఫేర్, ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద నిరసనలు జరిగాయి.

మొగల్తూరు: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు పాఠశాలల వద్ద ఆందోళన నిర్వహించారు. కెపి పాలెం ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో మండల యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చింతపల్లి కృష్ణ మోహన్, హెచ్ఎం నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, వై.ధర్మారావు, పి.జితేంద్ర కుమార్, ఉమాదేవి పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: పాలకొల్లు మునిసిపల్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన కొనసాగింది. మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. ఉద్యోగులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గంట సేపు జరిగిన నిరసన కార్యక్రమంలో హోరెత్తిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు, కార్యదర్శి ముచ్చర్ల రామకృష్ణ ప్రసాదు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్.కుమార్ రాజా, కోశాధికారి జి.సీతారామ్, నందివాడ రాము, మహిళా కార్యదర్శి జి.కృపాజ్యోతి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1లో ఐదుగురు ఆరుగొలను గురుకుల పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షకు 10 మంది హాజరు కాగా బి.దినేష్, వి. సంజయ్‌కుమార్, యు.ప్రవీణ్‌తేజు, జె.మనోహర్, ఎం. సుధీర్‌బాబు ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

ఈవీఎంలపై అవగాహన



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15: పెరిగిన సాంకేతికతో ఓటు హక్కు వినియోగించుకోవడంపై అవగాహన అవసరమని ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం శివారు ఫుడ్ ఫ్యాక్ట్స్ వద్ద ఈవీఎంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈవీఎం మిషన్ ఎలా ఉపయోగించాలో వివరించారు. పెంటపాడు ఎంపీడీవో వెంకట ప్రసాద బాలాజీ, ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పెంటపాడు, ఫిబ్రవరి 15: ముక్కేపురం రామాలయంలో గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. గ్రామానికి చెందిన కటారి గంగాజలం కుమారుడు హరికృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కిలపర్తి వెంకట్రావు, గంధం సతీష్, పంతం శేఖర్, మల్లెల ప్రసాద్, బోడగిరి వెంకటేశులు, యిమ్మంది లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, ఫిబ్రవరి 15: మరమ్మతుల కారణంగా మండలంలోని ప్రత్తిపాడు, పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, రావికుంట, ముక్కేపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ జే.పద్దరాజు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 15: జగన్ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ కొద్దిసేపు ధర్నా చేసి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా దానయ్యనాయుడు, ఆర్‌కె బాబ్జీ, సూరిబాబు, రఘురాం, వెంకటాచార్యులు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవం



పెంటపాడు, ఫిబ్రవరి 15: రాచర్లలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలు వలవల బాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్ బాబాను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ బేతిన గిరిధర్, మల్లెల కృష్ణారావు, కొండ్రెడ్డి బదరీ నారాయణ, కొండ్రెడ్డి బాబూరావు, పాలకుర్తి ప్రసాద్, కొండ్రెడ్డి సురేష్, కొండ్రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు రానివ్వద్దు

పెంటపాడు, ఫిబ్రవరి 15: ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా బీఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. గురువారం పడమరవిప్పర్రు, జట్లపాలెం, మౌంజీపాడు, రావికుంట, మీనవల్లూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కనకదుర్గ, కార్యదర్శి చక్రవర్తి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై విచారణ

పెంటపాడు, ఫిబ్రవరి 15: బి.కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ ఎంపీటీసీ సత్యనారాయణతో పాటు పలువురు గ్రామస్థుల అభియోగాలపై గురువారం ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాలాజీ వెంకట రమణ విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్‌పీవో తెలిపారు.

ఎస్పీని కలిసిన సర్పంచ్‌లు

పాలకోడేరు, ఫిబ్రవరి 15: జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లను ఎస్పీ కార్యాలయంలో పాలకోడేరు మండల సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మండల సర్పంచ్‌ల ఛాంబర్ కార్యదర్శి, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీను, శృంగవృక్షం గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, బొల్లం గాంధీ, గొరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, తదితరులు ఉన్నారు.

ఆకివీడు ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ఆకివీడు, ఫిబ్రవరి 15: ఆర్టీసీ కొత్త బస్టాండ్ ఆవరణను గురువారం భీమవరం ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సురేశ్ పరిశీలించారు. మరుగుదొడ్లకు తలుపులు, తాగునీరు తదితర సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామన్నారు.

దేశానికి యువత వెన్నెముక

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 : దేశానికి యువత వెన్నెముక అని, దేశభవిష్యత్ నేటి యువత, విద్యార్థులపై ఆధారపడి ఉందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ అప్కా సిద్దిక్ అన్నారు. సీఎస్ఎస్ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థులకు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సిగరెట్, మద్యం, డ్రగ్స్ లాంటి మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. నేర గణాంకాల ప్రకారం దేశంలో సుమారు 21 కోట్ల మంది వివిధ మాదక ద్రవ్యాల బాధితులుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండి సలీంఖాన్, జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హన్, ఎస్ఐవో పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అమీన్ పాల్గొన్నారు.



అలంకరణలో శ్రీకాళహస్తీశ్వర స్వామి.. దర్శించుకుంటున్న మాజీ మంత్రి పితాని

వైభవంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి కల్యాణం

పోడూరు, ఫిబ్రవరి 15: కవిటంలో అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు ఐదవ రోజు గురువారం అత్యంత ఘనంగా జరిగాయి. వేదపండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. 56మంది రుత్వికులచే 1,232 సార్లు రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 25మంది రుత్వికులచే 84సార్లు చండీ నిర్వహించారు. రుద్ర హోమం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. యాగోత్సవాలు పురస్కరించుకుని రాత్రి శ్రీకాళహస్తి శ్రీజ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. మాజీమంత్రి పితాని సత్యనారాయణ, బీవీకె.శివన్నారాయణ యాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

వైభవంగా పెద్దింట్లమ్మ కల్యాణం



ఆకివీడు, ఫిబ్రవరి 15: అంగరంగ వైభవంగా పెద్దింట్లమ్మ-జలదుర్గ శక్తీశ్వర స్వామి కల్యాణం గురువారం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్దింట్లమ్మను దర్శించుకొని కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో దేవస్థానం మేనేజర్ సాగి శ్రీనివాస రంగరాజు, ఛైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు, ఫిబ్రవరి 15: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 48 రోజులకు గాను రూ.11 లక్షల 54వేల 585 ఆదాయం లభించినట్టు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. దేవదాయశాఖ ఈవోలు వి.రాజా, లోకేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ పూజలు

ఆచంట, ఫిబ్రవరి 15 : కొడమంచిలిలో శ్రీ రుక్మిణి సమేత మదన గోపాలస్వామి ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు హోమాలు జరిగాయి. గ్రామానికి చెందిన బాలనాగు ఉప్పరయ్య, శేషారత్నం దంపతులు వీరి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ బాలనాగు నరేష్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబును కలసిన పేకేరు శ్రీను



తణుకు, ఫిబ్రవరి 15: తణుకు పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు భూపతిరాజు వెంకట నర్సింహరాజు (పేకేరు శ్రీను) గురువారం చంద్రబాబును ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన జిల్లాలో పార్టీ నేతలతో మనస్పర్థల కారణంగా కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 15:విద్యార్థినులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని ప్రముఖ పేథాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి అన్నారు. దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏవిధంగా ఈస్థితికి చేరుకున్నాను అనే విషయం విద్యార్థినులతో పంచుకున్నారు. భాషా నైపుణ్యాలైన రాయటం, చదవటం, మాట్లాడటం, ముఖ్యంగా వినడం అనేవి విద్యార్థి దశలో చాలా ముఖ్యం అనే విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తమ సేవా పురస్కార్ అవార్డు పొందిన కళాశాల సీపీడీసీ సభ్యుడు కొమ్ముల మురళీకృష్ణను ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు సన్మానించారు.

ప్రజా క్షేమం కోసం పాటుపడేవారిని ఎన్నుకోవాలి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 15 : ప్రజాసంక్షేమం కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా రెవెన్యూశాఖ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయవాదులతో ఓటు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. చెరుకువాడ రంగసాయి ప్రతిజ్ఞ చేయించారు.

సీపీఐ ఉద్యమ నిధికి విరాళాలు

ఉండి, ఫిబ్రవరి 15: ప్రజాపోరాటాలే ఊపిరిగా పనిచేస్తున్న సీపీఐ ఉద్యమ నిధికి విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించాలని మండల సీపీఐ కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. గురువారం ఎన్ఆర్‌పిఅగ్రహారంలో సిపిఐ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి నిధి సేకరణ చేశారు. కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరల నియంత్రణకు రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటాలు సాగిస్తుందన్నారు.